క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం మండలస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజలు అందించిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. భూసమస్యలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, సదరం సర్టిఫికెట్లు తదితర అంశాలపై 18 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే వచ్చే పరిణామాలకు సంబంధిత అధికారులదే బాధ్యతని హెచ్చరించారు.

మెనూ అమల్లో నిర్లక్ష్యం వద్దు



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీవైఈవో, ఎంఈవో

మాకవరపాలెం: మెనూ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఉప విద్యాశాఖాధికారి అప్పారావు హెచ్చరించారు. స్థానిక ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో మూర్తి, హెచ్ఎం అచ్యుతరామయ్య ఉన్నారు.

జాబ్ మేళా నిర్వహించాలని వినతి

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రిన్సిపాల్ డా.ఎస్.రాజుకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో పీజీ పూర్తి చేసిన ఎంతో మంది విద్యార్థులు ఉపాధి అవకాశాల్లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరికీ ఉపాధి కల్పించేలా కృషి చేయాలన్నారు. కళాశాలలో చదువు పూర్తయిన విద్యార్థుల అర్హతల మేరకు సంబంధిత కంపెనీలను సంప్రదించి జాబ్ మేళాలు నిర్వహించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వైస్ ప్రెసిడెంట్ పైల రాజు ఉన్నారు.

కబ్జా భూముల్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు



శింగవరంలో ప్రభుత్వ భూముల్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

బుచ్చెయ్యపేట: మండలంలోని శింగవరంలో ప్రభుత్వ భూములను మండల రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. స్థానికేతరులు, బడా బాబుల ప్రభుత్వ భూ ఆక్రమణలపై స్థానికులు ఆదివారం నిరసనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించి డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ చంద్ర, ఆర్ఐ శ్రావణ్, వీఆర్వో సుధాకర్, సచివాలయ సర్వేయర్ కిషోర్‌లు తమ సిబ్బందితో ప్రభుత్వ భూముల్ని పరిశీలించారు. ఆక్రమణదారులెవరని ఆరా తీశారు. పీఎస్ పేట, పి.భీమవరం, కొండెంపూడి, వడ్డాది, శింగవరం తదితర గ్రామాలకు చెందిన వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ భూములకు గతంలో ఎవరికి డి ఫారం ఇచ్చారో, ఎంత మేరకు ఇచ్చారో విచారణ జరిపి, ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు గ్రామస్తులకు తెలిపారు.

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ


కె.కోటపాడు: ప్రముఖ క్రీడాకారిణి పీటీ ఉష నిర్వహిస్తున్న ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో అయ్యన్న పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డెన్ స్కూల్ అవార్డుకు ఎంపికవడం అభినందనీయమని కె.కోటపాడు ఎస్ఐ లక్ష్మినారాయణ అన్నారు. పాఠశాలలో సోమవారం జరిగిన విద్యార్థులు, ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్‌కు గోల్డెన్ స్కూల్ అవార్డును ఎస్ఐ అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.

జాబు దేవుడికెరుక బాబూ.. భృతి మాటేంటి?

యువతకు 20 లక్షల ఉద్యోగాలు
అప్పటి వరకు
నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి..

ప్రజాగళం పేరిట ఎన్నికలకు ముందు కూటమి నేతలు విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో తొలి హామీ ఇదే. తమ ఎన్నికల ప్రచారంలో యువతను ఆకర్షించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, కూటమి భాగస్వామి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పదేపదే ప్రచారం చేసిన హామీ కూడా ఇదే. అధికారంలోకి వచ్చాక ఒక్కో హామీపై యూ టర్న్‌లు తీసుకుంటున్నారు. ఉచిత ఇసుక, చదువుకున్న విద్యార్థులందరికీ రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం హామీలపై ఇప్పటికే నాలుక మడతేశారు. నిరుద్యోగ భృతిపై కూడా ఇప్పటి వరకూ ఉలుకూ పలుకూ లేదు. దీంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.

– దేవరాపల్లి, చీడికాడ, రోలుగుంట



నెల రోజులు దాటినా..



ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పడంతో ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటుతున్న నిరుద్యోగ భృతిపై ఎలాంటి స్పందన లేదు. నిరుపేద కుటుంబానికి చెందిన నేను డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లయింది. ప్రస్తుతం ఉద్యోగ అన్వేషణలో ఉన్నాను. ఇప్పటి వరకు ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. కనీసం నిరుద్యోగ భృతి అయినా అందిస్తే కొంత మేర ఆసరా దొరుకుతుంది.

– గ్రటెడ్డి సింహాచలంనాయుడు, నిరుద్యోగి, వెంకటరాజుపురం, దేవరాపల్లి మండలం

అందరికీ భృతి అందించాలి



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఇచ్చిన నిరుద్యోగ భృతి వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. నేను హిందీ పండిట్ కోర్సు పూర్తి చేశా. ప్రస్తుతం నాకు ఉద్యోగం లేదు. ప్రభుత్వ ప్రకటన పేరిట 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు వారికే భృతి అందిస్తారని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అది సరికాదు. ప్రతి నిరుద్యోగికీ నిరుద్యోగ భృతి అందించాలి. 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న హామీపైనా చర్యలు తీసుకోవాలి.

– బర్ల అర్జున్, నీలంపేట, చీడిపల్లి పంచాయతీ, చీడికాడ మండలం

జీవనం కష్టంగా ఉంది



నాది బీకా డిగ్రీ పూర్తయింది. ఏ ఉద్యోగం లేక ఖాళీగా ఉండటంతో జీవనం కష్టంగా ఉంది. ఇలాంటి సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అంత వరకు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా. మా లాంటి నిరుద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అండగా నిలవాలి. సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని వెంటనే జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై విధివిధానాలు ఖరారు చేయాలి.

– మరిసా శ్రీను, నిరుద్యోగి, బల్జిపాలెం, రోలుగుంట మండలం

గ్రంథాలయ భవన నిర్మాణానికి వినతి

నర్సీపట్నం: ఉమ్మడి జిల్లా కేంద్రమైన విశాఖలో జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాల నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి పౌరగ్రంథాలయ సేవా సమితి ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు సోమవారం వినతి పత్రం అందించారు. ఆర్థిక రాజధాని విశాఖలో కేంద్ర గ్రంథాలయ భవనాలను త్వరితగతిన నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. మహరాణిపేటలోని రూ.100 కోట్ల విలువైన గ్రంథాలయానికి సంబంధించిన ఎకరా స్థలాన్ని బడా రాజకీయ నేతలు కబ్జా చేయాలని చూశారని, దానిపై పౌర గ్రంథాలయ సేవా సమితి అడ్డుకోవటంతో ఆగిందన్నారు. స్థలాన్ని కాపాడి, గ్రంథాలయ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అయ్యన్నపాత్రుడిని కోరారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం అందిస్తున్న గ్రంథాలయ సమితి ప్రతినిధులు

దోమల నివారణతో వ్యాధుల నియంత్రణ

కె.కోటపాడు: వర్షాకాలం నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు సూచించారు. గొండుపాలెం గ్రామంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా ప్రతి శుక్రవారం పాత్రల్ని ఖాళీ చేయాలన్నారు. ఫ్రైడే డ్రైడే పేరిట ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, ప్రజలు దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కనకవేణి, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్ఎం కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గొండుపాలెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

స్పందించిన విద్యుత్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దేవరాపల్లి: మండలంలోని కొత్త పెంట పంచాయతీ శివారు కొత్తూరులో సూరెడ్డి వారి కల్లాలు వద్ద ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రమాదకరంగా విద్యుత్ తీగలు శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండల ట్రాన్స్‌కో ఏఈ కె.శంకరరావు తన సిబ్బందితో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. పంట పొలాల మధ్యలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభానికి సపోర్టుగా రెండు స్టే వైర్లు అమర్చి, నిటారుగా నిలబెట్టారు. క్రిందికి వేలాడుతున్న వైర్లను కూడా సరిచేశారు. దీంతో స్థానిక రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తమ ఇబ్బందిని తొలగించేందుకు కృషి చేసిన సాక్షికి స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తపెంట శివారులో ఒరిగిన స్తంభం, వ్రేలాడిన తీగలను సరిచేసిన విద్యుత్‌శాఖ అధికార్లు

‘ఉపాధి’ బకాయిలు చెల్లించాలని నిరసన

దేవరాపల్లి: ఉపాధి హామీ పథకం కూలీల బకాయిలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బి.టి.దొర డిమాండ్ చేశారు. చింతలపూడి సచివాలయం పరిధిలోని ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు వారాల వేతనాలను చెల్లించక పోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మే నెలలో రెండు వారాలు, జూన్‌లో రెండు వారాల సొమ్మును వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్థానిక సచివాలయం అధికార్లకు వినతి పత్రం అందించారు. చింతలపూడితో పాటు గరిశింగి, వాలాబు పంచా యతీ పరిధిలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని, సమస్యను తక్షణమే పరిష్కరించకుంటే ఉపాధి హామీ కార్యాలయాల వద్ద ఆందోళనకు దిగుతా మని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కోరాడ, వంతెవాని పాలెం, కొత్తూరు, వీరభద్రునిపేట తదితర గ్రామాల ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

చోడవరం: రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. నియోజకవర్గ కేంద్రం చోడవరం మేజర్ పంచాయతీలో సిబ్బంది, పాలకవర్గం, ఐదు సచివాలయాల సిబ్బందితో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ పార్టీ వారు పాలకవర్గంలో ఉన్నా ప్రజల సమస్యలు, గ్రామ అభివృద్ధికి కలిసి పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నరకు పైగా సమయం ఉందన్నారు. ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంలో అంటు రోగాలు ప్రబలకుండా ముందస్తుగా పరిసరాలను పరిశుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయాల సిబ్బంది జాబ్ చార్ట్ సిద్ధం చేసుకుని పనిలో నిర్లక్ష్యం లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్ బండి నూకాలమ్మ, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, కార్యదర్శి నారాయణరావు, సామాజిక కార్యకర్త సకురు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

కృష్ణావతారంలో జగన్నాథుడు



చోడవరం: జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా సోమవారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చోడవరంలో 11 రోజుల పాటు బోళ్లవీధి రామాలయంలో స్వామివారిని దశావతార రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. 9వ రోజు స్వామిని కృష్ణావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.

18న మరిడిమాంబ జాతర

మాడుగుల రూరల్: మాడుగుల గ్రామ శివారులో కొలువైన మరిడిమాంబ అమ్మవారి జాతర ఈ నెల 18న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక మరిడిమాంబ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చాటింపు వేసారు. 16న సతకంపట్టు వద్ద అమ్మవారి ఘటాల కొలువు, 18న జాతర నిర్వహించనున్నట్లు రైతు సంఘం ప్రతినిధులు తెలిపారు. జాతర సందర్భంగా అదే రోజు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జంపెనలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

మాడుగుల రూరల్: మండలంలోని జంపెన గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ 50 మందికి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

135 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

రోలుగుంట: మండలంలో పండ్ల తోటల పెంపకానికి రైతుల నుంచి 135 ఎకరాల భూమిని సేకరించినట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కోసూరి సూర్యమణి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో తమ శాఖ ద్వారా చేపడుతున్న పనులు, ప్రతిపాదనలను మీడియాకు వివరించారు. పంట భూముల గట్లపై కొబ్బరి మొక్కలు నాటడం, మండలంలోని పంచాయతీల్లో పంట కాలువల కోసం ఆయా గ్రామాల రైతుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. దీనిపై తమ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలోనే వీటికి సంబంధించిన పనులు చేపడతామన్నారు.

స్త్రీనిధి రుణాలపై అవగాహన తప్పనిసరి

రోలుగుంట: స్త్రీనిధి రుణాల మంజూరుపై స్వయం సహాయక గ్రూపు సభ్యులు అవగాహన పెంచుకోవాలని వెలుగు ఏపీఎం కె.సాధన సూచించారు. కొమరవోలు క్లస్టర్‌లోని ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సర కొత్త రుణాలపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రుణం అందిస్తామన్నారు. సకాలంలో చెల్లింపులు జరిపే సంఘాలకు రుణాల పునరుద్ధరణలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. సంఘాల నిర్వహణను క్లస్టర్ సామాజిక కార్యకర్తలు పర్యవేక్షించి, పలు సూచనలు చేయాలన్నారు. సదస్సులో క్లస్టర్ సామాజిక కార్యకర్త నాగేశ్వరరావు, క్లస్టర్ పరిధి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు

నాతవరం: రక్త పరీక్షలు చేయడం ద్వారా విద్యార్థినుల్లో రక్తహీనత ఉంటే, సకాలంలో గుర్తించి నివారించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి యం.రాజేష్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులు మూడు నెలలకోసారి రక్తపరీక్షలు నిర్వహిస్తామన్నారు. రక్తహీనత గుర్తించిన విద్యార్థులకు ఇంజక్షన్లు, ఐరన్ మాత్రలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

నాతవరం: సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా, బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు సూచించారు. మండలంలోని పి.జగ్గంపేట, పీకే గూడెం, గునుపూడి, పెదగొలుగొండపేట పంచాయతీల్లో సోమవారం ఆయన పర్యటించారు. ముందుగా సచివాలయ ఉద్యోగులతో సమావేశమై గ్రామాల్లో ప్రధాన సమస్యలపై చర్చించారు. డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు పట్ల జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

నాతవరం: పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రైనేజీలు శుభ్రం చేస్తున్నట్లు నాతవరం సర్పంచ్ గొలగాని రాణి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం పారిశుధ్య పనుల్లో భాగంగా తాగునీటి పథకాలు, బోర్లలో క్లోరినేషన్ పనులు చేపట్టారు. ఎంతో కాలంగా పూడుకుపోయిన డ్రైనేజీలను పొక్లెయిన్లతో శుభ్రం చేయించారు. గ్రామస్తుల అభీష్టం మేరకు ఏళ్ల తరబడి తొలగింపునకు నోచుకోని నాతవరం మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీల్లో పూడికను తొలగించామన్నారు. సీజనల్ రోగాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఈబీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడిగా శివనారాయణరాజు

నర్సీపట్నం: సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంఘం(ఎస్ఈబీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా కె.శివనారాయణరాజు నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు కె.రామకృష్ణ, హ్యూమన్ రైట్స్ సెల్ అధ్యక్షుడు కోన మంగయ్యనాయుడు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

నారుమడులకు ఊపిరి పోసిన వర్షం

కె.కోటపాడు: మండల గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో రైతులు వర్షం పడుతుందని ఎదురుచూసినా పడలేదు. ఇప్పటికే వరి నారుమడులను సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. వర్షాల్లేక పోవడంతో అందుబాటులో ఉన్న వ్యవసాయ బోర్ల నుంచి పలు గ్రామాల్లో ఆకుమడులకు నీటి తడుల్ని రైతులు అందించారు. బోర్లు అవకాశం లేని రైతులు వరుణుడిపై భారం వేసి ఆశగా ఎదురు చూశారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆకుమడులకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. దీంతో పాటు ఎండిపోతున్న వరినారుకు ఊపిరినిచ్చింది. మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాల్లో 98 శాతం మేర వరినారు వేశారు. వర్షాల్లేక ఎండిపోతున్న నారు మడులకు తాజా వర్షాలు జీవం పోశాయి. ఈ వర్షాలకు మండలంలోని తాచేరు, పెద్దేరు, ఉరకగెడ్డ జలాశయాలల్లో నీరు చేరింది. వారం రోజుల పాటు అడపా దడపా వర్షాలు కురిస్తే ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమవుతాయి. మండలంలో 13 వేల ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు ఇప్పటికే నారు మడుల్ని సిద్ధం చేశారు.

17 మందికి కు.ని. ఆపరేషన్లు

గొలుగొండ: స్థానిక పీహెచ్‌సీలలో సోమవారం 17 మంది బాలింతలకు కుటుంబ నియంత్రణ(కు.ని.) ఆపరేషన్లు నిర్వహించారు. గొలుగొండ, చీడిగుమ్మల, కృష్ణదేవిపేట పీహెచ్‌సీల పరిధిలోని వీరికి, కు.ని.పై అవగాహన కల్పించి శస్త్రచికిత్సలు చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికార్లు లక్ష్మణ్‌రావు, శ్యామ్, ధనుంజయ్‌తో పాటు దిగువ స్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.